# మరుమల్లె

ఊరు పొలిమేర దాకా వాయువేగంగా వచ్చిన రైలుబండి, ఔటర్ సిగ్నల్ చూడగానే పెద్దపెట్టున ఆక్రోశిస్తూ అక్కడే నిలబడిపోయింది. పరుగెత్తి రైలులో ఏడు సంవత్సరాలైనా ప్రయాణం చెయ్యవచ్చు. కాని ప్రయాణమంతా పూర్తిచేసి తీరా స్టేషను చేరే సమయానికి సిగ్నల్ యివ్వక బండి ఆగిపోతే మాత్రం కాలం క్షణమొక యుగంకంటె ఆలస్యంగా నడుస్తుంది. ఈ ఆలస్యం, అందులో రామానికి మరీ బాధగా ఉంది. మూడు సంవత్సరాల అనంతరం తను ఈ దేశానికి తిరిగి వస్తున్నాడు. మూడు సంవత్సరాలలో తన జీవితం అంతులేని మార్పు చెందింది. తన జీవిత పంథా ఎన్నడూ ఊహించనట్టి మార్పు చెందింది.

నాలుగు సంవత్సరాల క్రితం ఇండియాలోని అనేకమంది ఎమ్.ఎస్.సి. లలో తను ఒకడు. కాని ఈనాడు? ఈనాడు వస్తుందని తను ఏనాడూ ఊహించుకోలేదు. తన సబ్జెక్టు ప్రత్యేకమైనది. దాంట్లో తను చేసిన కృషికి అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్ యివ్వటమే కాదు. తన పనిని గురించి అమెరికా దేశంలోని సైంటిస్టులు ఎంతగానో పొగిడారు. తను భారతీయుడనని, తనవల్ల భారతదేశానికి ఎనలేని గౌరవం లభించిందని అంతా తనను కొనియాడారు.

ఉద్యోగం కోసం, ఉదర పోషణ కోసం తను ఈనాడు ఎవరినీ ఆశ్రయించ వలసిన పనిలేదు. తను అమెరికాలో ఉండగానే ఉద్యోగం యిస్తామంటూ మూడు నాలుగు ఇండియన్ కంపెనీలు తనకు ఆహ్వానం పంపించాయి.

ఇరవై అయిదు సంవత్సరాలు పూర్తిగా నిండని తనకు ఒక కంపెనీ నెలకు ఇరవై ఆరువందల రూపాయల జీతం యిస్తామని రాసింది. ఈ అదృష్టం తన ఒక్కడిదే కాదు. నిజానికి దీంట్లో తన కృషి కంటే యితరులు చేసిన సహాయం, చూపిన సానుభూతి తనకు యీనాడు యింత అదృష్టాన్ని కలిగించగలిగాయి. కాని అదృష్టానికి చరమసీమ ఏమిటి?

శ్రీరాములవారి లాంటి అన్నగారు, సీతాదేవిని మించిన వదినగారు తనకు ఉన్నారు. తల్లీతండ్రీ లేని లోటు వదిన తమ యింటికి రాగానే తీరిపోయింది. ఆవిడ తమ యింట్లో అడుగు పెట్టిననాడు తమ అదృష్టమే మారింది. వదిన వచ్చి అన్నయ్య జీవితాన్ని పూలబాట చేస్తే, జానకి తన జీవితంలోకి వెన్నెల్లాగా వచ్చింది. తనను చూడగానే జానకి కన్నులలో మసలే మందహాసం చూస్తూవుంటే

తనకు ఏదో కొండంత ఆసరా దొరికినట్టు అనిపించేది. తనకు ఎమ్.ఎస్‌సి. లో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చింది. ఉద్యోగం చేద్దామని అనుకుంటూ వుంటే జానకి తనతో ఒకే ఒకమాట అన్నది.

"రామం! నీకు యూనివర్సిటీ ఫస్ట్ వచ్చిందంటే నేను ఎంత గర్వపడు తున్నానో చెప్పలేను. నేను ఒక్కదాన్నే కాదు రామం, యావత్తు భారతదేశం నిన్ను చూసి గర్వించాలి. భారత చరిత్రలో నీ పేరు సువర్ణాక్షరాలతో లిఖింపబడాలి."

"ఆ యోగ్యత, అర్హత నాకు ఉన్నాయా జానకీ?"

"ఆ యోగ్యత నీకు లేకపోతే మనదేశంలో ఎవరికీ లేదు రామం! నువ్వు ఫారిన్ వెళ్ళి అక్కడవాళ్ళచేత కూడా ఔననిపించుకోవాలి."

"నా చదువు కోసం అన్నయ్య, వదిన ఎన్నో త్యాగాలు చేసారు జానకీ! వాళ్ళకు యింకా యిబ్బంది కలిగించడం మంచిది కాదని నా ఉద్దేశం. వాళ్ళకి చేతనైనంత సేవ చేసి నా ఋణం తీర్చుకోవాలి."

"అన్నదమ్ముల మధ్య ఋణమేమిటి? ఒక్కమాట అడగనా రామం!"

"అడుగు జానకీ!"

"నేను ఏమన్నా యిస్తే అదికూడా ఋణంగానే భావిస్తావా?"

"నేను నీ వాడనని నువ్వు తలిస్తే నేను ఋణంగా భావించను."

జానకి ఏమీ మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వి తలదించుకుంది. కాని తను అన్న మాటలు ఒకటికి పదిసార్లు మనస్సులో మారుమ్రోగాయి.... 'నేను నీ వాడనని తలిస్తే'

తను ఎంత తెలివితక్కువగా మాట్లాడాడు! జానకి మనస్సు ఎంత నొచ్చుకుందో. అందుకనే ఏమీ మాట్లాడలేదు. మాట్లాడకుండానే వెళ్ళిపోయింది.

మరునాడు జానకి వాళ్ళ యింటికి వెళ్ళాడు. జానకి యింట్లో లేదు.

"జానకి ఏదండీ?" అని జానకి వాళ్ళ నాన్నను అడిగాడు.

"ఎప్పుడు వచ్చినా జానకి సంగతే అడుగుతావు కానీ యీ ముసలివాడిని గురించి అడగవేం?" అని రామచంద్రయ్యగారు అన్నారు.

రామం ఏం మాట్లాడలేదు. కాని ముఖంలో చిరునవ్వు తొంగి చూసింది. పెదవులు పలకలేదు కాని యీసారి మనస్సే అడిగింది. జానకి ఎక్కడుంది?

"అవునులే. రాములవారికి జానకి యోగక్షేమాలు కావాలి కాని, జనకుడితో ఏం పని?"

"అది కాదండీ."

"అదికాదనే నాకు తెలుసయ్యా. సీతమ్మ తల్లి పంచవటిలో వుంది."

రామం ఏం మాట్లాడలేదు. వడి వడిగా అంగలు వేసుకుంటూ 'పంచవటి' చేరాడు.

అది ఏనాడు ఎవరు కట్టించారో తెలియదు కాని, అడవిలాగా పెరిగిన ఆ ప్రాంతంలో, విగ్రహంలేని ఆలయం ఒకటి అనాదిగా ఆ వూరులో వుంది. ఎందుకనో గాని ఎవరు ఆ ఆలయదైవాన్ని ప్రతిష్టించే ప్రయత్నంగాని, దీపారాధన చేసే ఏర్పాటుగాని చెయ్యలేదు.

యాదృచ్ఛికంగా రామచంద్రయ్యగారు ఆవూరు రావడం తటస్థించింది. గవర్నమెంటు పనిమీద వచ్చిన ఆయనకు, మనస్సులో యీ ఆలయం నిలచి పోయింది. రిటైరు కాగానే తన ఒక్కగానొక్క కూతురు తల్లి లేని బిడ్డ జానకిని వెంటబెట్టుకొని యీ వూరులో వచ్చి స్థిరపడిపోయాడు.

ఆయన నిరంతర, నిర్విరామకృషి వల్ల మందిరానికి ప్రాణం వచ్చింది. దైవానికి నీడ దొరికింది. జానకీ సమేతంగా ఆ నిశాచర వినాశకరుడు ఆ దాశరథి, యీ కుగ్రామంలో, తమ రూపు నిలపడానికి, తన వారిని చల్లని చూపు చూడాలని ఆకాంక్షతో అక్కడికి దయచేశారు.

పట్టపగలే దయ్యాలు భూతాలు తిరుగాడుతాయన్న వదంతి గల ఆ దయ్యాల మర్రి తోట, మరుమల్లెల తోటగా మారింది.

శివధన్నుని ఎక్కుపెట్టే వేళలో దాశరధి, జనక తనయను తొలిసారిగా చూడగలిగితే, యీ మరుమల్లెల తోటలోనే రామానికి జానకి మొదటిసారిగా కనిపించింది.

తెలియని వాళ్ళకు అపరిచితులలాగా కనిపించినా యుగ యుగాల అనుబంధం వారిని ఇట్టె పరిచయం చేసింది.

"మీరు రామచంద్రయ్యగారి అమ్మాయి అని అనుకుంటాను" అని రామమే పలుకరించాడు.

ఆనాటినుంచి వారి పరిచయం కాలం కంటె వేగంగా పరుగెత్తింది. బహుశః దానికి కారణం వారి మనస్సులకు తెలుసు కాబోలు.

కాని ఏనాడు వీరి మనస్సులోని మాట మనస్సు వదిలిరాలేదు.

ఏమో? ఎందుకనో?

రామచంద్రయ్యగారు చెప్పినట్లుగానే జానకి పంచవటిలోనికి మరుమల్లెల తోటలో, పూల సజ్జతో నిలబడి వుంది. తలంటి పోసుకుందికాబోలు పట్టు కుచ్చులాంటి జుట్టు గాలికి రెప రెప లాడుతోంది.

'జానకీ' అని రామం పిలిచాడు.

'హల్లో!' అని తను బదులు పలికింది.

"ఐయాం వెరి సారీ" అని అన్నాడు.

జానకి ఉలిక్కిపడి ఇతని వంక చూసింది.

"ఏం జరిగింది?" అని అడిగింది.

"నిన్న నేను అన్నమాటలు నీ మనస్సుకి బాధకలిగించి వుండవచ్చు. నిన్ను బాధపెట్టడం నా ఉద్దేశ్యం ఎప్పుడూ కాదు."

"నాకేం అర్థం కావటంలేదు రామం."

"నేనన్న మాట నీస్నేహం మీద ఆపేక్షమీద షరతులు పెడదామని కాదు.'

"ఏమిటి రామం నువ్వనేది?"

"ఐ లవ్ యూ."

జానకి ఒక్కసారి ముఖాన్ని తన రెండు చేతులతో కప్పుకుంది.

రామం తలవంచుకొని ఆమె సన్నిధిలో నిలబడ్డాడు. కొద్దిక్షణాలు ఇద్దరూ మాట్లాడలేదు. చివరకు జానకి మాట్లాడింది.

"రామం ప్లీజ్ గో యెవే" అని అన్నది.

"కోపమా" అని రామం అడిగాడు.

జానకి ఇతని వంక చూడకుండానే 'లేదు' అని అంది.

ఆనాటి జీవితపుబాట ఒక మంచి మలుపు తిరిగింది. ఫారెన్ స్కాలర్‌షిప్ విషయం అన్నయ్య వదినే కూడా ప్రస్తావించారు. ప్రొఫెసర్ స్వయంగా రికమెండ్ చేశాడు. పూనుకుని ప్రయత్నం చేశాడు. స్కాలర్‌షిప్ వచ్చింది.

కాని అమెరికా వెళ్ళడానికి టికెట్టుకు, బట్టలకు డబ్బు కావాలి. ఎక్కడ నుంచి వస్తుంది?

నగలన్ని యిచ్చేస్తానని వదినె అన్నది. ఇల్లు తాకట్టు పెడదామని అన్నయ్య అన్నాడు.

కాని ఇల్లు తాకట్టు పెట్టలేదు. వదినె నగలు అమ్మలేదు.

"ఇది ఏనాడైనా జానకికి కట్నంగా యివ్వవలసిందేగా ఇప్పుడు యిస్తే అందరికీ అక్కరకు వస్తుంది" అని జానకి వాళ్ళ నాన్నగారు అన్నారు.

"రామం వెళ్లేలోపలే ఆ మూడు ముళ్లు వేయిస్తే" అని వదినె అన్నది.

జానకీ వాళ్ళ నాన్నగారు ఎంతో సంతోషించారు.

అంతా బాగుందన్నారు.

తను కాదని అనలేదు.

జానకి మాత్రం ససేమిరా ఒప్పుకోలేదు.

"నాన్నగారు చేసే సహాయాన్ని షరతుగా మార్చటం నాకు యిష్టంలేదు రామం! చదువుతున్నంత కాలం నీకు స్వేచ్ఛ వుండాలి. అమెరికా నుంచి వచ్చిన తర్వాత కూడా నీ మనస్సు మారకపోతే నేను నీకు తగినదాన్ని. నీ మనస్సుకు ఆనాడుకూడా అనిపిస్తే చాలు."

"జానకీ!!"

"ఇల్లా మాట్లాడుతున్నానని ఏమీ అనుకోవద్దు రామం! ఈ జానకి నీ మెడకొక గుదిబండ కావటం నాకు యిష్టం లేదు. నాన్నగారు మీ కుటుంబానికి స్నేహితులుగా సహాయం చేసినవారుగా వుండాలి. అంతేకాని కొనబోయే వస్తువుకు, బయానా యిచ్చినట్టు వుండకూడదు రామం."

"ఎందుకు జానకీ యిల్లా మాట్లాడుతావు!"

"ఇందులో నా స్వార్థంకూడా కొంత వుంది రామం! ప్రపంచంలో అందరిచేత ఎన్నికైన వ్యక్తి నీడలో నేను నిలబడాలని నా కోరిక... కాదనవుకాదు!"

జానకి మీద అంతులేని కోపం వచ్చింది. కాని అంతలోనే మనస్సు కృతజ్ఞతతో నిండిపోయింది..

దేవతలు ఒక్క స్వర్గంలోనేకాదు, యీ భువిలో కూడా వుంటారని ఆనాడే తెలిసింది.

తను వెళ్ళేటప్పుడు అన్నయ్య, వదిన, జానకి, రామచంద్రయ్యగారు అంతా బొంబాయి వచ్చారు.

విమానం బయలుదేరడానికి కొద్ది క్షణాలు వ్యవధి వుంది. తనకు దండలు వేశారు. ఫోటోలు తీసారు. జానకి తన దగ్గరకు రాగానే అన్నయ్య, వదినే రవ్వంత దూరంగా వెళ్ళారు.

"రామం... అమెరికాలో వాళ్ళు చాలా అందంగా వుంటారుటగా. వాళ్ల మధ్య యీ కురూపిని మరిచిపోవు కాదు" అని జానకి అంది. అంతులేని ధైర్యం, ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడే ఆ ముఖంలో ఒక్కక్షణం భయం, అవిశ్వాసం కనిపించాయి.

ప్రయాణీకులకు హెచ్చరిక వచ్చింది.

"గుడ్ బై జానకి" అని రామం అన్నాడు.

ఏనాడు యింతవరకూ చెయ్యని పని జానకి చేసింది. తన చేతిని రెండు చేతుల్లోకి తీసుకుని,

"మళ్ల ఎన్ని జన్మలకు కనిపిస్తావో రామం!" అని అన్నది.

అంతే, తరువాత జానకి తనకు కనిపించలేదు!

ఎంతో ప్రయత్నంమీద అలా మూడు సంవత్సరాలు గడిచాయి. ఈనాడు తను డాక్టర్ రామ్. జీవితంలో ఒక మహోత్కృష్టమైన లక్ష్యాన్ని సాధించాలనే తృప్తి తనకు కలిగింది. కాని యీ తృప్తి వెనుక ఒక నిరాశ, ఒక అర్థం కాని ఆవేదన మాత్రమే తనకు మిగిలాయి.

మొదటి రెండు సంవత్సరాలు జానకి దగ్గరనుంచి ప్రతివారం ఉత్తరం వచ్చేది. మూడో సంవత్సరం మొదట్లో ఆలస్యంగా మొదలుపెట్టాయి. ఆరు నెలల నుంచి అసలు ఉత్తరమే లేదు. తను రాసిన ఏ ఉత్తరానికి సమాధానం లేదు.

'ఎందుకని? ఎందుకని?' అని తనని తను అనేక సార్లు ప్రశ్నించుకున్నాడు.

సమాధానం రాలేదు. కాని ఒక అనుమానం మాత్రం మనస్సులో నిలచి పోయింది.

జానకి మారిపోయింది. జానకి నన్ను మరిచిపోయింది. అమెరికాలో అప్సరసలాంటి ఆడపిల్లలతో కలిసి వున్నప్పుడుకూడా తను జానకిని మరిచిపోలేదు. అందమైన ఆడపిల్లను చూచినప్పుడు తన మనస్సున మసలిన భావమల్లా ఒకటే.

జానకి ఏం చేస్తోందో!

ఈ ఆలోచన కొన్ని రోజుల తరువాత...

జానకి ఎందుకు ఉత్తరం రాయటం లేదు?

మరి కొన్ని రోజుల తరువాత...

జానకి నన్ను మరిచి పోయిందా అన్న ప్రశ్నగా మారింది.

మూడు సంవత్సరాలు పూర్తి అయ్యాయి. తను వచ్చినపని నిర్విఘ్నంగా నెరవేరింది అని అన్నయ్యకు, జానకికి ఉత్తరాలు రాశాడు.

అన్నయ్య దగ్గరనుంచి సమాధానం లేదు.

జానకి దగ్గర నుంచి సమాధానం లేదు.

కాని ఎన్నడూ తనకు ఉత్తరం రాయని వదినె దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

తన అన్ని ప్రశ్నలకు, అనుమానాలకు సమాధానం ఆ ఉత్తరంలో వుంది.

మరుమల్లె తోటలోని జానకి ముఖం తన మనస్సులో మదిలింది...

మరునాడే భారతదేశానికి ప్రయాణ మైయ్యాడు.

తను వస్తుంటే న్యూయార్కు ఎయిర్ పోర్టు దాకా తన 'బాస్' తనతోబాటు వచ్చాడు.

"రామం! మీ దేశంలో ఎప్పుడు నీకు నచ్చకపోతే అప్పుడు ఇక్కడకు వచ్చేసేయి. నీకు యీ సంస్థలో ఒక ఉద్యోగం సిద్ధంగా వుంటుంది" అని అన్నాడు.

బొంబాయి నుంచి హైదరాబాదు వరకు తనతో ఒక ఇండియన్ జర్నలిస్టు ప్రయాణం చేశాడు. తను అమెరికాలో చేసిన రీసెర్చిని గురించి కొంచెం సేపు మాట్లాడుకున్నారు.

"ఇహ ఇండియాలోనే సెటిలు అయిపోతారా" అని అతను రామాన్ని అడిగాడు.

"సాధ్యమైనంత త్వరలో తిరిగి వెళ్లిపోతాను."

"ఎందుకని?"

"ఈ దేశంలో నాకు ఏమీ లేదు."

"నన్ను అపార్థం చేసుకోకండి. ఈనాటి సైంటిస్టులకి భారతదేశం మీద ప్రేమలేదు. వాళ్ళ మనస్సంతా విదేశాల మీదనే."

రామం ఏం సమాధానం చెప్పలేదు.

సికిందరాబాదునుంచి బెజవాడ దాకా ఒక విచిత్రమైన వ్యక్తి తనతో ప్రయాణం చేశాడు. చక్కటి యింగ్లీషు మాట్లాడాడు. వయస్సు చూడబోతే చాలా తక్కువ. కాని ఎంత సేపూ భగవంతుడు, కర్మసిద్ధాంతం, సాముద్రికం వగైరా విషయాలు మాట్లాడాడు.

"ఒంటరి తనమంటే మీకు ఇష్టమేనా?" అని తనను అడిగాడు.

"మీ ప్రశ్న నాకు అర్థం కావటం లేదు" అని రామం అన్నాడు.

"కొందరి జీవితాలు ఒంటరిగానే గడపవలసి వుంటుంది."

"ఎందుకని?"

"వాళ్ళు ఏవో ప్రత్యేకమైన లక్ష్యాలు సాధించడానికే ఉద్భవిస్తారు. అందుకనే వాళ్ళకు సామాన్య మానవులకి వుండే సుఖాలు వుండవు."

"అన్ని సుఖాలువుంటే తమ లక్ష్యాలను యింకా తేలికగా సాధించగలుగుతారుగా!"

"లక్ష్యసాధనకు తపస్సు అవసరం. తపస్సులో వ్యధే వుంటుంది. సుఖం వుండదు. వ్యధ తీరిననాడే సుఖాన్ని పొందేది."

కావాలని వేదనని కొనితెచ్చుకోవడం దేనికి? దాన్నుండి విముక్తికి తపస్సు చెయ్యడం దేనికి?"

"వేదన దైవికంగానే వస్తుంది. విముక్తి మానవయత్నంవల్ల లభిస్తుంది."

ఇద్దరి దారులు వేరయ్యేచోట ఆయన ఒక మాట అన్నాడు.

"ఎన్ని అవాంతరాలు వచ్చినా దైవం మీద మాత్రం ఆశపోగొట్టుకోవద్దు. Remember it is darkest before dawn."

ఆయన మాటలకు తనకు నవ్వు రాలేదు, కోపం రాలేదు. జాలి వేసింది.

ఈదేశానికి ఇక్కడి ప్రజలకు ముఖ్యంగా కావలసినది తిండి, బట్ట. ఆ రెంటి విషయం గురించి, మానవుడు మానవుడుగా జీవించడానికి కావలసిన కనీసపు సౌకర్యాలని గురించి, ప్రజలు గాని, ప్రజానాయకులుగాని ఆలోచిస్తున్నట్టు కనిపించటం లేదు. ఇహం గురించి మరిచిపోయి పరం గురించి ప్రాకులాడితే ఏం లాభం? అందుకనే మిగతా దేశాలకంటె యీనాడు యింత వెనుకబడింది.

పెద్ద పెట్టున ఇంజను కూసింది. రామం ఉలిక్కిపడ్డాడు. రెక్కవాలింది. రైలు కదిలింది.

ప్లాట్‌ఫారం మీద అన్నయ్య ఒక్కడే నిలబడి వున్నాడు.

తననిచూసి ఏం మాట్లాడలేదు. దగ్గరకు రాగానే కౌగలించుకున్నాడు.

ఇంటిదగ్గర వదినె గుమ్మంలోనే ఎదురైంది. ప్రక్కయింటి ముత్తైదువులు ఇద్దరు ఆవిడదగ్గర నుంచున్నారు.

తనకు మంగళహారతి యిచ్చారు. కాని ఎవ్వరి మొఖంలో చిరునవ్వు లేదు.

భోజనాల దగ్గర అన్నయ్య "కొన్ని రోజులు వుంటావా రామం" అని అడిగాడు.

తను ఏం చెబుతాడో విందామని వదినె ఆదుర్దాతో ఎదురు చూస్తోంది.

"సాధ్యమైనంత త్వరలో మళ్లీ వెళ్ళిపోతాను" అని రామం అన్నాడు.

అన్నయ్య ఒక్క క్షణం ఏం మాట్లాడలేదు. "మంచిది" అని అన్నాడు.

భోజనం చేసి రామం ముందు గదిలోకి వచ్చాడు.

"జానకిని చూసి వస్తాను" అని అన్నయ్యతో అన్నాడు.

రామాలయం దాటి మరుమల్లెల తోట కూడా దాటి రాము వూరికి ఉత్తరంగా ఒక అరమైలు నడిచాడు. అక్కడ ఇంకొక పంచవటి ఆశ్రమం కనిపించాయి.

అక్కడి మరుమల్లె తోటలో జానకి పూలసజ్జ చేతుల్లో పట్టుకుని నిలబడి వుంది. ఆ చిన్నదాని ముఖంలో చిరునవ్వు కనిపిస్తోంది.

"జానకి" అని రామం పిలిచాడు.

జానకి అల్లాగే నవ్వుతూ నిలబడి వుంది.

"నేను తిరిగి వచ్చాను. జానకీ, ప్రపంచంలో నలుగురిచేత ఔననిపించుకో గల అర్హతను పొంది వచ్చాను జానకీ."

ఎక్కడి నుంచో "రామం!" అని పిలిచినట్టు అనిపించింది. రామం ఒక్కసారి ఉలిక్కిపడి ఆపాదమస్తకం చూశాడు.

ఆమె పాదాల చెంత వున్న చలువ రాతి పలక మీద ఎండలో బంగారు అక్షరాలు మిల మిలా మెరుస్తున్నాయి.

చిరంజీవి జానకి.

శ్రీరామ పాదసన్నిధి

14-9-1965